


శాస్త్రీయ దృక్పథం పెంపునకే వేసవి వినోదం

రిటైర్డ్ డిఇఒ ఇందుకూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

విద్యార్థుల్లో శాస్త్రీయ దక్పథం, చదువు పట్ల ఆసక్తి పెంపొందించేందుకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే వేసవి వినోదం కార్యక్రమాలు దోహదపడతాయని రిటైర్డ్ డిఇఒ ఇందుకూరి ప్రసాదరాజు అన్నారు. పాలకోడేరులో రిసోర్స్‌పర్సన్స్‌కు జిల్లాస్థాయి వేసవి వినోదంపై శిక్షణ తరగతులు గురువారం నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా నిర్ణయించిన 20 శాఖా గ్రంథాలయాల్లో ఈ నెల 5వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ వేసవి వినోదం కార్యక్రమాలు జరుగుతాయని జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లుల శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో జెవివి నేతలు బి.చైతన్యప్రసాద్, ఎం.రాజేంద్రబాబు, వై.అజయ్‌కుమార్, డి.కళ్యాణి, వెంకన్నబాబు, సిహెచ్.ప్రసాదరావు, రాజు, హరికృష్ణ, జాన్సన్ పాల్గొన్నారు.



ఉంగుటూరు: మొలకలు వచ్చిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న చంద్రబాబు

ఏం తినాలి.. ఎలా బతకాలి


- నాచుగుంట, నందమూరుల్లో చంద్రబాబు వద్ద ఘొల్లుమన్న వరి రైతులు
- సంచులు ఇవ్వరు, లారీలు పంపరు.. ముక్కపేరుతో కోతలంటూ ఆవేదన
- చిరిగిన సంచులు చూపిస్తూ ఇదీ మా దుస్థితి అన్న రైతులు
- తడిసిన, మొలకెత్తిన ధాన్యం చూపుతూ కన్నీరుమున్నీరు
- పిల్లలకు ఫీజులు కట్టలేని పరిస్థితి ఏర్పడిదంటూ బాధ
- చివరి రైతుకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటాం
- రైతులకు చంద్రబాబు భరోసా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, ఉంగుటూరు, తాడేపల్లిగూడెం

'పండించిన ధాన్యం పొలాల్లోనే ఉంది. అకాల వర్షాలకు ధాన్యం తడిసి, మొలకలొచ్చాయి.. సంచులు ఇవ్వరు.. లారీలు పంపరు.. ముక్కపేరుతో కోతలు పెడుతున్నారు.. ఇలాగైతే తాము ఏం తినాలి.. ఎలా బతకాలి' అంటూ నాచుగుంట, నందమూరు గ్రామాల్లో పర్యటించిన టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఎదుట రైతులు ఘొల్లుమన్నారు. గురువారం ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం నాచుగుంట, పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని నందమూరు గ్రామాల్లో చంద్రబాబు పర్యటించారు. విజయవాడ నుంచి వచ్చిన చంద్రబాబుకు కలపర్రు టోల్‌గేట్ వద్ద టిడిపి శ్రేణులు పెద్దఎత్తున స్వాగతం పలికాయి. అనంతరం ఒంటిగంటకు చంద్రబాబు కాన్వాయ్ నాచుగుంట చేరుకుంది. హైవే పక్కన పుంతరోడ్డులో కల్లాల్లో ఉన్న ధాన్యపు రాశులను చంద్రబాబు చూశారు. ఆయన వాహనం దిగే సమయానికి వర్షం మొదలైంది. దీంతో కొంతసేపు వాహనంలోనే ఉండిపోయారు. వర్షానికి పుంతరోడ్డు పూర్తిగా బురదగా మారడంతో కార్లు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో ట్రాక్టర్‌పై ఎక్కి కొంతదూరం చంద్రబాబు ధాన్యపు రాశులను చూశారు. తర్వాత కాలినడకన వెళ్లి కల్లాల్లో తడిసిన ధాన్యపు రాశులను, మొలకొచ్చిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడి ఓదార్చారు. మహిళా రైతు జువ్వలపల్లి ప్రభావతి, రైతులు సుంకవల్లి మహదేవ, రవిశంకర్ తదితరులు మాట్లాడుతూ సంచులు ఇవ్వడం లేదని, ఇచ్చిన సంచులు సగం చిరిగిపోయి ఉంటున్నాయని, లారీలు లేక ధాన్యం వెళ్లడం లేదని, ముక్కపేరుతో మిల్లర్లు భారీగా కోతలు పెడుతున్నారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం అమ్ముడు కాక పిల్లలకు ఫీజు కట్టలేని పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటి వరకూ అధికార పార్టీకి చెందిన ఎంఎల్‌ఎలుగాని, మంత్రులుగాని తమ వద్దకు రాలేదన్నారు. మీరొస్తున్నారని బుధవారం సాయంత్రం సంచులు ఇచ్చారన్నారు. 12 ఎకరాల్లో పంటను మాత్రమే కొనుగోలు చేయడంతో ఎక్కువ భూమి సాగుచేసిన రైతుల పరిస్థితి దారుణంగా మారిందన్నారు. 60 బస్తాలు పండిస్తే 53 బస్తాలు మించి కొనుగోలు చేయడం లేదన్నారు. నిన్నటి వరకూ 45 శాతంగా ఉన్న చితుకు నిబంధనను 40 శాతానికి కుదించారన్నారు. తమగోడు ఏఒక్కరూ వినిపించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. చిరిగిన సంచులను చంద్రబాబుకు చూపించి తమ పరిస్థితి ఈవిధంగా ఉందన్నారు.

మద్దతు ధరకు తడిసి, మొలకెత్తిన ధాన్యం కొనుగోలు చేయాలి : చంద్రబాబు

ప్రభుత్వ అసమర్థత కారణంగా వరి రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వచ్చిందని చంద్రబాబు అన్నారు. ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరిస్తే రైతులకు ఇన్ని కష్టాలు ఉండేవి కావన్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన తీరు చూస్తే సిగ్గేస్తుందన్నారు. వర్షాల గురించి వాతావరణ శాఖ ముందుగానే చెబుతుందని, వ్యవసాయశాఖ పంట, నూర్పిళ్ల గురించి వివరిస్తుందని ఇవన్నీ బేరిజు వేసుకుని ముందుకు సాగితే ఈ పరిస్థితి వచ్చేదికాదన్నారు. రైతులకు న్యాయం చేయండి.. లేకపోతే రాజీనామాలు చేయండంటూ సవాల్ విసిరారు. సంచులు ఇవ్వరు, లారీలు పంపించారు, డబ్బులు ఇవ్వకపోతే రైతుల పరిస్థితి ఏమిటన్నారు. కరోనాలో అన్నీ మూతపడినా రైతులు పొలాల్లో దిగి పండించడం కారణంగానే ఆహార కొరత రాలేదన్నారు.



తాడేపల్లిగూడెం: రైతు వద్ద ధాన్యాన్ని పరిశీలిస్తున్న చంద్రబాబు



ఉంగుటూరు: మహిళా రైతుకు సొమ్ము అందిస్తున్న చంద్రబాబు

మహిళా రైతు ప్రభావతికి రూ.2.30 లక్షలు సాయం

పిల్లలకు ఫీజు కట్టలేని పరిస్థితిలో ఉన్నానని చెప్పిన మహిళా రైతు ప్రభావతినిఫీజు ఎంతో అడిగి రూ.2.30 లక్షలు నగదు చంద్రబాబు అప్పటికప్పుడు అందజేశారు. దీనిపై ప్రభావతి మాట్లాడుతూ తాను ఇప్పటి వరకూ వైసిపి అని, ఇక నుంచి టిడిపి కోసం పని చేస్తానని అన్నారు. పార్టీలో చేర్చునేందుకు సాయం చేయలేదని, కష్టాల్లో ఉన్నారని రైతుకు సాయం చేశానని చంద్రబాబు చెప్పారు. తాను వస్తున్నానని అప్పటికప్పుడు లారీలు, సంచులు ఇస్తున్న అధికారులు ముందుగా ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. ప్రతి రైతుకూ బస్తాకు రూ.1530 ఇచ్చేలా టిడిపి పోరాడుతుందన్నారు. చివరి రైతుకు న్యాయం జరిగే వరకూ పోరాటం ఆగదన్నారు. అవసరమైతే మళ్లీ వస్తా.. తాడేపేడో తేల్చుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గన్ని వీరాంజనేయులు, తోట సీతారామలక్ష్మి, ఎంఎల్‌ఎలు నిమ్మల రామానాయుడు, మంతెన రామరాజు, టిడిపి నేతలు పాల్గొన్నారు.



ఆచంటలో ధాన్యం రాశులపై బరకాలు కప్పుతున్న రైతులు

వీడని వర్షం.. రైతులకు కష్టం

ప్రజాశక్తి - ఆచంట

ద్రోణి ప్రభావంతో గురువారం సాయంత్రం ఆచంట మండలంలో భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకూ వాతావరణం పొడిగానే ఉన్నా సాయంత్రం ఒక్కసారి ఆకాశం మేఘావృతమైంది. అనంతరం భారీ వర్షం కురవడంతో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన ధాన్యం తడిసి ముద్దయింది. కల్లాల్లోని ధాన్యపు రాశులు కూడా తడిసిపోయాయి. ఆచంట కచేరి సెంటర్లో ఉన్న ఆర్అండ్‌బి ప్రధాన రహదారిపైకి మోకాలు లోతు నీరు చేరింది. ఇప్పటికే ప్రకృతి వైపరీత్యాల వల్ల ఎకరాకు ఐదు మంచి ఆరు బస్తాల వరకు ధాన్యం దిగుబడి కోల్పోయామని, తాజా వర్షాలతో ధాన్యానికి ధర దక్కని పరిస్థితి ఉందని పలు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని నేరుగా కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని మండల రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు.



సిబ్బందికి ఆదేశాలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - గణపవరం

ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా లేని పరిస్థితుల్లో రైతుల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని మొయ్యేరులో ఆర్‌బికెను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంత ధాన్యం కొనుగోలు చేశారు, రైతులు ఎంతమంది వచ్చారు అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో ఉన్న తేమశాతం మిషన్. కాటాను, స్టాక్ రూమ్‌లను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించే రైస్ మిల్లులను సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలుకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పమ్మి లక్ష్మి, ఎంపిడిఒ జి.జ్యోతిర్మయి, వ్యవసాయాధికారి వై.ప్రసాద్, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న జెసి

రైతులు అధైర్య పడొద్దు

జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి


ప్రజాశక్తి - ఉండి

రైతులు పండించిన మొత్తం ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులెవరూ అధైర్య పడొద్దని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి అన్నారు. గురువారం పెదపుల్లేరు గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, చెరుకువాడలోని రామాంజనేయ మోడరన్ రైస్‌మిల్లును ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రైతుల నుండి ఎంత ధాన్యం సేకరణ చేశారు అడిగి తెలుసుకుని తేమశాతం, కాటా, రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం జెసి మాట్లాడుతూ రైతులు పండించిన మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, రైస్‌మిల్లర్ల వద్దకు వెళ్లి రైతులు ఎవరూ అధైర్య పడొద్దని సూచించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే రైతుభరోసా కేంద్రాన్నిగాని, వ్యవసాయ శాఖాధికారులనుగానీ సంప్రదించాల న్నారు. ధాన్యం రవాణాకు లారీలు, గోనె సంచుల కొరత లేకుండా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకున్నామని తెలిపారు. జెసి వెంట డిప్యూటీ తహశీల్దార్ ఎస్.వీరాస్వామినాయుడు, మండల వ్యవసాయ శాఖాధికారి బి.సంధ్య, ఆర్‌బికె సిబ్బంది ఉన్నారు.

మొగల్తూరు చేరిన విద్యాకానుక కిట్‌లు

ప్రజాశక్తి - మొగల్తూరు

జగనన్న విద్యా కానుక కిట్‌లు తమ పాఠశాలకు చేరుకున్నాయని మొగల్తూరులోని పెనుమత్స రంగరాజు జెడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్‌విఆర్.మూర్తిరాజు తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికిగాను విద్యార్థులకు 5,404 షూస్, టెక్ట్స్ బుక్స్ సుమారు 18 వేలు వచ్చాయని చెప్పారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులు, స్కూల్ బ్యాగ్స్ రావాల్సి ఉన్నాయన్నారు. వారం రోజుల్లో అవి పాఠశాలకు చేరుకుంటాయని, అవి వచ్చాక మండలంలోని పాఠశాలలకు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పిలు ఆనంద్, మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.




రైతులతో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

వ్యవసాయ శాఖ జెడి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - పాలకోడేరు

వర్షాల నేపథ్యంలో మాసూళ్లు చేసిన రైతులు ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి జడ్.వెంకటేశ్వరరావు సూచించారు. శృంగవక్షం రైతు భరోసా కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాబోయే రెండు, మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు చేసిందని, దీనిపై రైతులను అప్రమత్తం చేయాలని వ్యవసాయ సహాయకులకు సూచించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని ఆన్‌లైన్‌లో విక్రయించి వీలైనంత త్వరగా రైసుమిల్లులకు తరలించాలన్నారు. తేమ శాతం ఎక్కువగా ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు చేఆస్తరన్నారు. ఆయన వెంట ఇన్‌ఛార్జి ఎడిఎ వి.నారాయణరావు, సిబ్బంది ఉన్నారు.



వినతిపత్ర అందిస్తున్న ఆశాలు, నేతలు

సమస్యలు పరిష్కరించాలని ఆశాల ధర్నా

ప్రజాశక్తి - పోడూరు

ఆశాలకు సంక్షేమ పథకాలు అందించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, నియామకాల్లో రాజకీయ జోక్యం ఉండరాదని, సంబంధం లేని పనులను తమకు అప్పగించొద్దంటూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ డి.రాజేష్, ఆర్‌ఐ రాంబాబులకు వినతిపత్రం అం దజేశారు. కార్యక్రమంలో ఆశాలు గొల్లల జ్యోతి, జి.కృష్ణవేణి, వి.సత్యవతి, ఎస్‌కె.సైదాబీబీ, సిపిఎం మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

సూడాన్ నుంచి పోడూరువాసి క్షేమంగా రాక



పోడూరు చేరుకున్న వెంకటరమణ

ప్రజాశక్తి - పోడూరు

సూడాన్‌లో నెలకొన్న అంతర్యుద్ధం నుంచి సురక్షితంగా బయటపడి స్వగ్రామానికి చేరుకున్నారు పోడూరు వాసి బొక్కా వెంకటరమణ. వెంకటరమణ ఉపాధి రీత్యా ఏడేళ్ల క్రితం సూడాన్‌లో ఇంటి పనికి వెళ్లారు. రెండేళ్ల తర్వాత వచ్చి మళ్లీ వెళ్లిపోయారు. త్వరలోనే స్వదేశానికి వద్దామనుకుంటున్న తరుణంలో అక్కడ అంతర్యుద్ధం నెలకొనడంతో వెంకటరమణ గురించి ఆమె కుటుంబీకులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఎట్టకేలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో గురువారం పోడూరు చేరుకున్నారు. కలెక్టర్ ప్రశాంతి ఆదేశాల మేరకు అధికారులు గన్నవరం నుంచి అధికారులు ఆమెను పోడూరు తీసుకొచ్చి స్వగృహానికి చేర్చారు. ఆమెకు ఇద్దరు కుమారులు, భర్త ఉన్నారు.

పర్యాటక కేంద్రంగా పేరుపాలెం బీచ్ అభివృద్ధి

ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాద్‌రాజు

ప్రజాశక్తి - మొగల్తూరు

పేరుపాలెం బీచ్‌ను పర్యాటక కేంద్రంగా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాద్‌రాజు అన్నారు. గురువారం మండలంలోని పేరుపాలెం బీచ్‌లో వైఎస్ఆర్ స్మృతివనం, విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడారు. బీచ్ అభివృద్ధికి ప్రభుత్వం నుండి రూ.కోటి నిధులు మంజూరయ్యాయని, ఆ నిధులతో 60 రోజుల్లోనే వైఎస్ఆర్ స్మృతివనం నిర్మాణం, విగ్రహం ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు తిరుమాని బాపూజీ, సర్పంచి అందే వెంకటలక్ష్మి దొరబాబు, నాయకులు మోటుపల్లి రామభాస్కరరావు, పోతుల రమేష్, కొల్లాబత్తుల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ప్రసాదరాజు




విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను ఆపాలని సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - ఆకివీడు

తెలుగు ప్రజల బలిదానంతో ఏర్పడిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రయత్నించడం దారుణమని, ఆ ఆలోచనను విరమించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని సిపిఎం పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు పిలుపునిచ్చారు. స్థానిక గాంధీబొమ్మ సెంటర్లో ఆ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు పెంకి అప్పారావు అధ్యక్షత వహించారు. తవిటినాయుడు మాట్లాడుతూ ప్రయివేటు స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేటాయించకపోవడం దారుణమన్నారు. కేంద్రంతో పోరాడి ఉక్కు ఫ్యాక్టరీని కాపాడుకునేందుకు అన్ని పార్టీలూ కలిసి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు ఎస్‌కె.వలీ, డోకల రవితేజ, బొక్కా వెంకట వర్మ, నెల్లి సూరిబాబు, నిమ్మల శ్రీను, చిన్నారావు, శ్రీనురాజు, నక్కా రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా దాసరి జయంతి



కళాశాలలో మాట్లాడుతున్న వక్తలు

ప్రజాశక్తి - పాలకొల్లు

తెలుగు జాతికి ఔన్నత్యం తీసుకొచ్చిన వ్యక్తి దర్శకరత్న డాక్టర్ దాసరి నారాయణరావు అని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు కొనియాడారు. దాసరి నారాయణరావు జయంతి సందర్భంగా గురువారం పాలకొల్లులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ నటునిగా, దర్శకునిగా అనేక పాత్రలు పోషించి రాజకీయంగా, కేంద్రమంత్రిగా ప్రజలకు సేవ చేశారన్నారు. మహిళా సాధికారత కోసం అనేక చిత్రాలు తీసిన ఘనత దాసరి సొంతమని మాజీ ఎంఎల్‌ఎ డాక్టర్ బాబ్జీ చెప్పారు. సమావేశంలో ఎంఎల్‌సి అంగర రామ్మోహనరావు, వైసిపి నేతలు గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ, చెల్లెం ఆనందప్రకాష్ పాల్గొన్నారు. జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్, మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు, పట్టణ ప్రముఖులు జక్కంపూడి కుమార్ తదితరులు దాసరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వంగా నరసింహారావు, అడబాల వెంకటరమణ, యర్రంశెట్టి వెంకటరత్నం, గాదె ఆంజనేయులు పాల్గొన్నారు.

డిఎన్ఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో..

పాలకొల్లు డిఎన్ఆర్ కళాశాల వ్యవస్థాపకుడు, దర్శకరత్న దాసరి నారాయణరావు జయంతిని గురువారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల పాలకవర్గ సభ్యులు చోడిశెట్టి బారిస్టర్ మాట్లాడుతూ దాసరితో తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వైస్ ప్రిన్సిపల్ రవిశంకర్ మాట్లాడుతూ మహిళా సాధికారత కాంక్షిస్తూ లాభాపేక్షలేని అనేక ప్రయోజనాత్మక సినిమాలు నిర్మించిన గొప్ప వ్యక్తి దాసరి అని అన్నారు. నోబుల్ రాజ్ మాట్లాడుతూ గొప్ప ఆలోచనా దృక్పథం కలిగిన వ్యక్తి దాసరి అని అన్నారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు కె.నారాయణరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.



మహిళా పోలీసులతో సమావేశమైన డిఎస్‌పి, ఎస్ఐ

ఆన్‌లైన్ ఉద్యోగావకాశాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నర్సాపురం డిఎస్‌పి మనోహచారాచారి

2ప్రజాశక్తి - పెనుమంట్ర


ఆన్‌లైన్ ఉద్యోగావకాశాల పట్ల యువకులు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని డిఎస్‌పి కె.రవిమనోహరాచారి అన్నారు. గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆయన సందర్శించారు. మహిళా పోలీసుల పనితీరును సమీక్షించారు. అనంతరం డిఎస్‌పి మాట్లాడుతూ ఇటీవల కొంతమంది ఉపాధి నిమిత్తం బయట దేశాలకు వెళ్లినప్పుడు మిస్ అవుతున్నారని తెలిపారు. ఇవి జరగకుండా ఆయా గ్రామీణ ప్రాంతాల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఒటిపి, ఇకెవైసి, కొన్ని యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోమని వచ్చే మెసేజీల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో ఎస్ఐ బి.సురేంద్రకుమార్ పాల్గొన్నారు.

రాజు డాక్టర్ మృతి తీరని లోటు


డాక్టర్ రాజు (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి - ఉండి

ఉండి గ్రామంలో రాజు డాక్టర్‌గా పేరుగాంచిన కలిదిండి రామచంద్రరాజు బుధవారం హైదరాబాదులో అనారోగ్యంతో మరణించారు. కలిదిండి రామచంద్రరాజు మరణం వైద్య రంగానికి తీరని లోటని ఉండి లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు గాదిరాజు రంగరాజు అన్నారు. కలిదిండి రామచంద్రరాజు మంచి హస్తవాసి గల డాక్టర్ అని అతి స్వల్ప ఫీజు, అతి తక్కువ మందులు, సరైన రోగ నిర్ధారణ ఆ డాక్టర్ ప్రత్యేకత అని తెలిపారు. అందరూ రాజు డాక్టర్ అని పిలిచేవారన్నారు. పెదపుల్లేరుకు చెందిన ఆయన ఉండిలో చాలా కాలంపాటు వైద్య సేవలు అందించి మంచి డాక్టర్‌గా పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నారన్నారు. చావు అంచులవరకు వెళ్లిన వారికి, ముఖ్యంగా రసాయనాలు పిచికారీ చేస్తున్నపుడు ప్రాణాపాయంలో ఉన్నవారిని కాపాడటంలో ఆ మహాదిట్ట అని అన్నారు. రాజు డాక్టర్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన కుటుంబసభ్యులకు రంగరాజు ప్రగాఢ సానుభూతి తెలిపారు.


మాట్లాడుతున్న సిసి కేశనపల్లి సుధ

విధులు సక్రమంగా నిర్వర్తించాలి


ప్రజాశక్తి - పెనుమంట్ర

గొర్రె, కోళ్ల పంపిణీ తమకు పని మించి భారం అవుతుందని ఐకెపి సిసి కేశనపల్లి సుధ అన్నారు. బ్రాహ్మణ చెరువులోని ఐకెపి కార్యాలయంలో నెలవారి ఎంఎస్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సుధ మాట్లాడుతూ సిఎలు గ్రామ సంఘ సమావేశాలు, చిన్న గ్రామ సంఘాల పనితీరు వంటి కార్యక్రమాలు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ వారి వారి విధులు సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల సమైక్య ప్రెసిడెంట్ డి.సుబ్బలక్ష్మి, కోశాధికారి వరహాలు, జాయింట్ సెక్రటరీ వి.సాయిరమ్య, వైస్ ప్రెసిడెంట్ ఎస్.పుణ్యవతి, సిసి సత్యవతి, సిఎం పాల్గొన్నారు.

నిధుల మంజూరు కోరుతూ వినతి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్, ఎంపీ మిధున్‌రెడ్డికి ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ వినతిపత్రం అందించారు. ఉండి నియోజకవర్గ పార్టీ సమీక్ష సమావేశానికి హాజరయ్యేందుకు మిధున్‌రెడ్డి గురువారం భీమవరం రాగా ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ యూత్ క్లబ్ వద్ద ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం భీమవరం నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులకు సంబంధించి నిధులు మంజూరు కోరుతూ వినతిపత్రం అందించారు.



మిధున్‌రెడ్డి స్వాగతం పలుకుతున్న గ్రంధి శ్రీనివాస్

ఘనంగా సీతారామ్ పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - ఆచంట


ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్ పుట్టినరోజు వేడుకలు వైసిపి నాయకులు, కార్యకర్తల మధ్య గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. సీతారామ్‌కు పలువురు నాయకులు, కార్యకర్తలు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్‌పర్సన్ కాండ్రేగుల సత్యనారాయణ, నాయకులు కొండేటి భవానీప్రసాద్, మోహన్‌రావు, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు మురళి, వేణు, సురేష్ పాల్గొన్నారు.


మార్టేరులో ఇంద్రధనుస్సు

కనువిందు చేసిన ఇంద్రధనుస్సు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మార్టేరు వ్యవసాయ పరిశోధన సంస్థ ప్రాంగణంలో గురువారం మధ్యాహ్నం ఆకాశం మేఘావృతం కావడంతో ఇంద్రధనుస్సు కనువిందు చేసింది. వాతావరణ మార్పులతో వర్షంతో పాటు ఇంద్రధనుస్సు చూపరులకు కనువిందు చేసింది.


తనిఖీ చేస్తున్న అధికారులు

పలు దుకాణాల్లో శానిటేషన్ టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

పట్టణంలోని ఫిష్ మార్కెట్, రైతు బజారు, స్టీమర్ రోడ్డులో ఉన్న వివిధ దుకాణాల్లో మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో శానిటేషణ్ టాస్క్‌ఫోర్స్ టీమ్ గురువారం దాడులు చేశారు. ఈ దాడిలో నిషేదిత ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకుని సదరు షాపుల వారికి తగు జరిమానాలు విధించారు. షాపుల యజమానులకు ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్ధాలపై అవగాహన కల్పించారు. ఈ దాడుల్లో టౌన్ ప్లానింగ్ అధికారి, శానిటరీ ఇన్‌స్పెక్టర్, వార్డు శానిటేషన్, ఎన్విరాన్మెంట్ సెక్రటరీలు, శానటరీ మేస్త్రీలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814


రైతులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

నెంబర్ల ప్రమేయం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - పోడూరు

నెంబర్ల ప్రమేయం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్, బొంతు శ్రీను డిమాండ్ చేశారు. మండలంలోని పండితవిల్లూరు గ్రామంలో రైతులను వారు గురువారం కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ నెంబర్ రావడం లేదని ధాన్యం కొనుగోలు నిలుపుదల చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం బస్తా ఒక్కొక్కదానికి రూ.70 నుంచి రూ.80 తగ్గించి ఇస్తున్నారని, ప్రశ్నిస్తే బ్యాంకు ఖాతాలో పడతాయని చెప్తున్నారని, కాని అవి పడడం లేదని చెప్పారు. వరి కోసిన వెంటనే నెంబర్ ప్రమేయం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని, వెంటనే రైతులకు డబ్బు అందించాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో తానేటి ఆనందరావు, గెద్దడ దవల నెత్రుడు, నాగేశ్వరరావు, లక్ష్మి పాల్గొన్నారు.

నేటి నుంచి చిన్నగోపురంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈ నెల ఐదో తేదీ నుంచి 13 వరకు పాలకొల్లు శ్రీ అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామివారి దేవస్థానంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ గాదె వెంకన్న, ఇఒ పిటి గోవిందరావు తెలిపారు. 6న అరుణ చంద్రవాహన సేవ, 7న సూర్యప్రభ వాహన సేవ, 8న హనుమంత వాహన సేవ, 9న గరుడ వాహన సేవ, 10న శ్రీవారి పూలంగి సేవ, శ్రీవారి తిరుకళ్యాణం, 11న శ్రీవారికి చందనోత్సవం, 12న వసంతోత్సవం, 13న శ్రీ సుదర్శన మహాయజ్ఞం నిర్వహించనున్నట్లు తెలిపారు.

మహదేవపట్నంలో జాతర ప్రారంభం

ప్రజాశక్తి - ఉండి


మండలంలోని మహదేవపట్నం గ్రామంలోని గ్రామదేవతలు మహంకాళమ్మ, వెంకమ్మ, గంగానమ్మ, పోతురాజు జాతర మహోత్సవం గురువారం ఆలయ కమిటీ ఛైర్మన్ పెన్మెత్స రమేష్‌రాజు, వైస్ ఛైర్మన్ గొట్టుముక్కల శ్రీనివాస్ రాజు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు మాట్లాడుతూ అమ్మవార్ల జాతర సందర్భంగా 108 కలశాలతో గ్రామ పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించినట్లు వారు తెలిపారు. శుక్రవారం లక్ష్మీగణపతి హోమం, చండీ హోమం, నిప్పుల గుండం, శనివారం 108 కలశాలతో జలాభిషేకాలు నిర్వహించి ఆదివారం అఖండన సమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ వారు తెలిపారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మండలంలోని దండగర్ర గ్రామంలో అకాల వర్షలకు వరి పంట దెబ్బతిన్న రైతులను జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొలిశెట్టి శ్రీనివాస్ గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ దండగర్ర గ్రామంలో విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యం అకాల వర్షంతో తడిసిపోయిందన్నారు. పలు గ్రామాల్లోని చేతికి వచ్చిన పంట తడిసి ముద్దయిపోయి ఆరపోసిన ధాన్యం వర్షార్పణం అవ్వటంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారన్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో అలసత్వం వహించడంతో, సరైన సమయంలో రైతులకు గోనె సంచులు అందించకపోవడంతో ధాన్యం తడిసి రైతులు నష్టాలపాలయ్యారన్నారు. రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని బొలిశెట్టి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు గిద్ద సుబ్రహ్మణ్యం, నారపురెడ్డి రాంబాబు, బందిరి కృష్ణ, పోశయ్య, నాయుడు, జనసేన నాయకులు అడపా ప్రసాద్, ఉప్పు నరసింహమూర్తి, బుచ్చిబాబు, రామకృష్ణ, రామ్ శెట్టి సురేష్, పుల్లా బాబి, గుండుమొగుల సురేష్ పాల్గొన్నారు.


కాళ్లకూరు పంచాయతీ సిబ్బందికి సత్కారం


కాళ్లకూరు పంచాయతీ సిబ్బందిని సత్కరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరు గ్రామపంచాయతీ క్లీన్ అండ్ గ్రీన్ పంచాయతీగా మండల స్థాయి అవార్డును సాధించింది. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బందిని అధికారులు సత్కరించారు. కాళ్లకూరు గ్రామంలో పరిశుభ్రత ప్రాముఖ్యతను ప్రజలకు వివరించి ఎప్పటికప్పుడు పంచాయతీ అధికారులు గ్రామంలో చెత్తాచెదారం లేకుండా పరిశీలన చేపట్టారు. రోడ్లపై చెత్తాచెదారాలు లేకుండా చేస్తూ గ్రామ పరిశుభ్రతకు గ్రామస్తులు సహకరించారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ మరుగుదొడ్లు క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉండేలా పంచాయతీ దృష్టి సారించింది. పారిశుధ్యంపై జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం ద్వారా ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. పరిశుభ్రత కోసం రోజూ చెత్తసేకరణ జరుగుతోంది. ఈ సందర్భంగా కాళ్లకూరు గ్రామపంచాయతీ క్లీన్ అండ్ గ్రీన్ పంచాయతీగా మండల స్థాయి అవార్డును సాధించింది. గ్రామ సర్పంచి సాధు శ్రీదేవి, గ్రామ కార్యదర్శి బి.సతీష్‌కుమార్, సచివాలయ కార్యదర్శి ఎస్.సింధుజలను కాళ్ల ఎంపిపి పి.శిరీష విశ్వనాథరాజు, ఎంపిడిఒ జి.స్వాతి దుశ్శాలువాలతో సన్మానించి అవార్డులను అందించారు.

ఎంపిపిల సంఘం జిల్లా అధ్యక్షునిగా విజయ నరసింహరాజు


విజయ నరసింహరాజును అభినందిస్తున్న గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఎంపిపిల సంఘం జిల్లా అధ్యక్షునిగా భీమవరం ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. భీమవరంలో గురువారం నిర్వహించిన జిల్లా ఎంపిపిల సమావేశంలో ఎంపిపిలందరూ కలిసి నరసింహరాజును జిల్లా అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఈ సమావేశం రాష్ట్ర ఎంపిపిల సంఘం కన్వీనర్ మేకల హనుమంతరావు అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం నూతన పాలకవర్గం ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ మండలాల అభివృద్ధికి ఎంపిపిలు కృషి చేయాలని కోరారు. తొలుత నరసింహరాజును సత్కరించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు రుద్ర ధనరాజు, ఉపాధ్యక్షులు సబ్బితి సుమంగళిసాగర్, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు, అధికార ప్రతినిధి కర్రి వెంకటనారాయణ రెడ్డి, కార్యదర్శులు దాసరి హైమావతి, నల్లి జయలక్ష్మి, రాష్ట్ర కమిటీ సభ్యులు ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు పాల్గొన్నారు.


'అభివృద్ధిని విస్మరించిన వైసిపి'

ప్రజాశక్తి - ఉండి

సంక్షేమ పథకాలు ఇస్తున్నామనే పేరుతో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని టిడిపి మహదేవపట్నం అధ్యక్షులు వనిమా శ్రీనివాస్ అన్నారు. మహదేవపట్నం పరిధిలోని రామచంద్రపురంలో గురువారం నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో శ్రీనివాస్ మాట్లాడారు. వైసిపి హయాంలో నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. అభివృద్ధిని గాలికొదిలేసిందన్నారు. ప్రజా సమస్యలను పట్టించుకోని వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించాలన్నారు. గ్రామంలోని రహదారి పూర్తిగా పాడైపోయిందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో టిడిపిని గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. అధికారంలోకి వచ్చాక సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి టిడిపితోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గొట్టుముక్కల మహంకాళి రాజు, గంధం బుజ్జి, వేగేశ్న సూర్యనారాయణ రాజు, బొక్క శ్రీనివాస్ పాల్గొన్నారు.


కాటన్ పార్కు పరిశీలన

ప్రజాశక్తి - నరసాపురం టౌన్


పార్కును పరిశీలిస్తున్న ముదునూరి ప్రసాదరాజు

స్థానిక ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయం పక్కన ఉన్న కాటన్ పార్కును రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, ఎంఎల్‌ఎ ముదునూరి ప్రసాదరాజు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా ఆయన సంబధిత పురపాలక సంఘం అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాటన్ పార్కును ఆధునీకరణ చేసిన తరువాత అధిక సంఖ్యలో ప్రజలు పార్కును సందర్శించడం శుభ పరిణామమన్నారు. పార్కు సందర్శకులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆయన అధికారులకు సూచించారు. కాలువ గట్టు వద్ద ప్రహరీ గోడ పటిష్ఠతను మెరుగుపరచాలని అయన సూచించారు. ఈ తనిఖీల్లో పురపాలక సంఘం డిఇ ఆర్ రమేష్‌బాబు, ఎఇ మణి, నాయకులు దొంగ మురళీకృష్ణ ఉన్నారు.

ఘనంగా మన కోసం మనం స్వచ్ఛంద సేవా సంస్థ వార్షికోత్సవం


నిత్యావసరాలు అందిస్తున్న సంస్థ సభ్యులు

ప్రజాశక్తి - పోడూరు

మన కోసం మనం స్వచ్ఛంద సేవా సంస్థ ఐదో వార్షికోత్సవం మండలంలోని జిన్నూరు సుబ్బారాయుడు కాలనీలో గురువారం ఘనంగా నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు పడాల పెద్దిరాజు, కృష్ణవేణి ఆధ్వర్యంలో పలువురు ప్లాట్ రిక్షా కార్మికులకు, పంచాయతీ పారిశుధ్య కార్మికులకు నిత్యావసరాలను అందించారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ సేవ చేయడంలో ఉండే తృప్తి వెలకట్టలేనిదన్నారు. అందరి సహకారంతో విజయవంతంగా ఐదో వార్షికోత్సవం జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ముఖ్య అతిథులుగా సర్పంచి జమ్ము బేబీ మహాలక్ష్మి, జిన్నూరు సొసైటీ అధ్యక్షులు డిటిడిసి బాబు, పాలవలస తులసీరావు పాల్గొన్నారు. సంస్థ సభ్యులు కలిశెట్టి కనకారావు, దాసరి సత్యనారాయణ, కలిశెట్టి లక్ష్మి, భూపతిరాజు చిన్నసూరి, గండేటి శేఖర్, రవి, గ్రామ పెద్దలు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు



పాలకోడేరులో...

ప్రజాశక్తి - పాలకోడేరు

బాల్య వివాహాలు జరగకుండా ప్రతిఒక్కరూ బాధ్యత వహించాలని ఆకివీడు ఐసిడిఎస్ సిడిపిఒ వాణివిజయరత్నం అన్నారు. పాలకోడేరు మండల పరిషత్ కార్యాలయంలో బాల్య వివాహాలపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిడిపిఒ వాణి విజయరత్నం మాట్లాడుతూ మరో రెండు నెలలపాటు వివాహ ముహుర్తాలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పురోహితులు, పాస్టర్లు, ఇమామ్లు బాల్య వివాహాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎవరైనా బాల్య వివాహాలకు చేయడానికి ప్రయత్నిస్తే సమాచారాన్ని మహిళా శిశుసంక్షేమ శాఖ అధికారులకు, ఇతర ప్రభుత్వ శాఖలకు అందించాలని కోరారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాల కారణంగా బాలికలు భవిష్యత్తులో తీవ్ర అనారోగ్యాలకు గురవుతారని, వారికి పుట్టే శిశువుల ఆరోగ్యంపై ప్రభావం పడుతుందన్నారు. మత పెద్దలకు, తల్లిదండ్రులకు ఈ విషయాలపై అవగాహన కల్పించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్.మురళీగంగాధరరావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు సిహెచ్.సుజాతలక్ష్మి, పార్వతి పాల్గొన్నారు.


భీమవరం రూరల్‌లో...

భీమవరం రూరల్ : మండలంలోని తహశీల్దార్ కార్యాలయంలో బాల్య వివాహాలపై అవగాహన కల్పించేందుకు మత పెద్దలతో మండల సమావేశం గురువారం నిర్వహించారు. బాల్యవివాహాలపై చర్చి పాస్టర్లు, పురోహితులు, ముస్లిం మౌజాన్స్‌కు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. పోక్సో కేసు నమోదవుతుందని తెలిపారు. మత పెద్దలు వివాహం జరిపించే ముందే వారి వయస్సు తెలుసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో తహశీల్దార్, ఎంపిడిఒ, ఎంఇఒ, రూరల్ సిఐ, ఐసిడిఎస్ సిడిపిఒ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కూరగాయల రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రజాశక్తి - పెనుగొండ


కూరగాయల రైతులతో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు


కూరగాయల రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కౌలు రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. కూరగాయల రైతులను సమస్యలు అడిగి తెలుసుకునేందుకు మండలంలోని వెంకట్రామపురం గ్రామంలో కౌలు రైతు సంఘం నాయకులు గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా కూరగాయల రైతులు పలు సమస్యలను రైతు సంఘం నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. ఆరుగాలం కష్టపడినా తమకు గిట్టుబాటు ధర రావడంలేదని కూరగాయల సాగు చేస్తున్న రైతు చిన్నం రామిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా దొండ, బెండ కూరగాయల రకాలు సాగు చేస్తున్నారన్నారు. కూరగాయలకు మార్కెట్‌లో ధరలు లేక నష్టపోతున్నామని చెప్పారు. కూరగాయల పంటలకు ఎదురు పెట్టుబడి పెట్టాల్సి వస్తుందన్నారు. మార్కెట్‌లో పది కేజీల దొండకాయలకు రూ.40, పది కేజీల బెండకాయలకు రూ.180 వస్తున్నాయని చెప్పారు. ఒకరోజు పురుగుమందు పిచికారీ చేస్తే రూ.మూడు వేల ఖర్చవుతుందని రైతు వాపోయాడు. కూరగాయల సాగు చేస్తున్న తమకు గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి షేక్ బాదుషా మాట్లాడుతూ కూరగాయల రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.

KANAKADURGA FINAN CE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్ : ఏలూరురోడ్డు, లక్ష్మిథియేటర్ ఎదురు, జంగారెడ్డి గూడెం.
-1st ఫ్లోర్, సుబ్బారావుపేట,కమల హాస్పిటల్స్ ఎదురు, తాడేపల్లిగూడెం
-1st ఫ్లోర్, వెంకన్నప్లాజా, కప్పల వెంకన్న సెంటర్, వేల్పూరు రోడ్డు, తణుకు.
-1st ఫ్లోర్, కన్నపురం రోడ్డు, వాసవి కన్యకా పరమేశ్వరి గుడి పక్కన, కొయ్యలగూడెం.
-1st ఫ్లోర్, జెడ్‌ల్యాబ్స్ ఎదురు, ఆర్ఆర్‌పేట, ఏలూరు.
-1st ఫ్లోర్, బస్టాండ్ ఎదురు, దేవరపల్లి

బంగారు వేలం ప్రకటన

ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 25.05.2023 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 1172.84 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు హెడ్డాఫీసు : డోర్ నెం.54-9-23, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7 నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించు కోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంటే తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.

ఆథరైజ్డ్ ఆఫీసర్
కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్
H.O. : 100 అ॥ రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7.
Cell : 8008812798


పనులను పరిశీలిస్తున్న ముదునూరి ప్రసాదరాజు

పూడిక తీత పనుల పరిశీలన

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

పట్టణంలో పంజా సెంటర్ వద్ద పారిశుధ్య సిబ్బంది చేస్తున్న డ్రెయినేజీ పూడిక తీత పనులను రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శానిటేషన్‌పై ఎప్పటికప్పుడు స్పెషల్ డ్రైవ్ చేపట్టి పేరుకున్న చెత్తను తొలగించడంతో పాటు డ్రెయినేజీలో పూడికను తొలగించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. డ్రెయినేజీ పనులతో పాటు పారిశుధ్య పనులు కూడా చేపట్టినట్లు తెలిపారు. పట్టణ ప్రజలు తమ వంతు బాధ్యత తీసుకుని తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొంగ మురళీకృష్ణ, రెడ్డప్ప ధవేజి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గోపాలకృష్ణంరాజు

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

ప్రజాశక్తి - కాళ్ల

వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేయడం మాజీ ఎంపిపి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు అన్నారు. మండలంలోని కాళ్లకూరు గ్రామంలో దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఇందుకు చొరవ చూపిన ట్రస్టు అధినేత దాట్ల వెంకట రామరాజు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మాజీ ఎంపిపి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు చలివేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతూ వేసవిలో మజ్జిగ తాగటం ఎంతో ఆరోగ్యమన్నారు. వేసవి దాహార్తిని తీర్చడానికి ఇలాంటి మంచి కార్యక్రమాలు చేయడం ఎంతో సంతోషదాయకమని అడ్డాల నాగరాజు అన్నారు. దాట్ల వెంకట రామరాజు మాట్లాడుతూ నేటి నుంచి మే, జూన్ నెలలో మజ్జిగ చలివేంద్రం నిర్వహిస్తామన్నారు. ఇటీవల గౌరవ డాక్టరేట్ అందుకున్న దాట్ల వెంకట రామరాజును పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి నడింపల్లి ప్రదీప్‌రాజు, దండు రఘుకుమార్ రాజు, వేగేశ్న రామకృష్ణంరాజు, వేగేశ్న రామరాజు, బొర్రా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పాలకొల్లులో అన్నదానం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు అన్నా క్యాంటీన్ వద్ద గురువారం సిరింగుల పుష్ప జ్ఞాపకార్థం వారి కుమారులు రాంబాబు, మోహన్ పేదలకు ఉచితంగా భోజనాలు ఏర్పాటు చేశారు. వారికి ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి వద్ద కూడా మొబైల్ క్యాంటీన్ ద్వారా రోగులకు ఉచితంగా భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, జివి, పాలవలస తులసీరావు, మేడిశెట్టి కేశవ, రాము పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **BODA S N V SANTOSHI SUBBALAKSHMI DURGA MOUNIKA** (Old Name) W/O NAGA VENKATA ADITYA KUMAR VURUM, resident of : 2-5, near Galigopuram, Sanivarapupeta, Eluru, ELURU District - 534003, Change my name from **BODA S N V SANTOSHI SUBBALAKSHMI DURGA MOUNIKA** (Old Name) to **VURUM S N V SANTOSHI SUBBALAKSHMI DURGA MOUNIKA** (New Name). Hence forth, I am being Called as **VURUM S N V SANTOSHI SUBBALAKSHMI DURGA MOUNIKA** (New Name) W/O NAGA VENKATA ADITYA KUMAR VURUM for all purposes.

పాస్‌పోర్టు పోయినది

CHUTTUGULLA LAKSHMI, భర్త: ఏడుకొండలు అను నేను నా యొక్క పాస్‌పోర్టు పడిపోయినది. పెనుగొండ, చిన్నవారిపాలెం నుండి పెనుగొండ జిరాక్స్ సెంటర్‌కు వెళుతుండగా పడిపోయినది. నాయొక్క పాస్‌పోర్టు నంబర్: **S1604009** గల పాస్‌పోర్టు ఎవరికైన దొరికిన యెడల ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

అడ్రస్:
CHUTTUGULLA LAKSHMI
భర్త: ఏడుకొండలు, చిన్నవారిపాలెం
పెనుగొండ మండలం, ప॥గో॥జిల్లా
పిన్: 534320, సెల్: 63039 19270

దస్తావేజు పోయినది

ప॥గో॥జిల్లా, భీమవరం మండలం, కొవ్వాడ పుంత రోడ్, డో.నెం. 7-180, బైపాస్ రోడ్ గ్రామ కాపురస్తులు లేటు మహ్మద్ సుల్తాన్ షరీఫ్ గారి కుమారుడు మహ్మద్ ఆసిఫ్ పాషా అను నాకు చెందిన ది.06-04-2006 సం॥రం తేదీన భీమవరం సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసులో రిజిష్టర్ కాబడిన దస్తావేజు నెం. 2172/2006 గా రిజిష్టరు కాబడినది. ఈ ఒరిజినల్ దస్తావేజు సంచిలో పెట్టుకొని ది.02-05-2023వ తేదీన మా ఇంటి నుండి భీమవరం 1వ పట్టణంలో గల జిరాక్సు సెంటర్ నందు జిరాక్సు తీయించుకొనుటకు మోటార్ సైకిల్‌పై వెళ్ళుచుండగా మార్గ మధ్యలో అనగా భీమవరం 1వ పట్టణం పరిధిలో ఓల్డ్ వెంకట్రామా థియేటర్ సమీపంలో సంచి జారి పడిపోయినది. దొరికిన వారు ఈ క్రింది వారికి అందజేయవలసినదిగా కోరుచున్నాను.

మహ్మద్ ఆసిఫ్ పాషా
తండ్రి: సుల్తాన్ షరీఫ్, కొవ్వాడ పుంత,
సెల్: 98497 33477